
సాక్షి విశాఖపట్నం

ఆదివారం । 21 । ఏప్రిల్ । 2024



వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీఎం జగన్

ఉప్పొంగిన జనాభిమానం ముందు...మండు వేసవి చిన్నబోయింది. నిప్పులు కురిపిస్తున్న సూరీడును లెక్కచేయక వేలాది జనం తమ ప్రియతమ నేతను చూసేందుకు తరలిరావడంతో జాతీయ రహదారి జనసంద్రమైంది. దారిపొడవునా సీఎం జగన్ సిద్ధం బస్సు యాత్రకు జనం నీరాజనం పట్టారు. హారతులిచ్చి దీవెనలు అందించారు. ఆయనతో కరచాలనానికి, సెల్ఫీల కోసం పోటీపడ్డారు. తన రాక కోసం మండుటెండలో ఎదురు చూసిన అభిమానజనానికి జగనన్న **చేతులెత్తి అభివాదం చేశా**రు. బస్సు దిగి అక్క **చెల్లెమ్మలను, అవ్వాతాత**లను ఆత్మీయంగా **పలకరించారు. ఆపన్నుల**ను అక్కున చేర్చుకున్నారు. **వినతులు తీసుకు**ని నేనున్నాంటూ **భరోసా ఇచ్చారు. మరో**వైపు సీఎం బస్సు **యాత్ర జైత్రయాత్ర**లా సాగింది...వైఎస్సార్ **సీపీ శ్రేణుల్లో జోష్** నింపింది. సార్వత్రిక **సమరానికి సన్నద్ధుల్ని** చేసింది..





ఆత్మీయ నేతకు నీరా'జనం' : కశింకోట మండలం చింతలపాలెంలో బహిరంగ సభకు తరలివచ్చిన అశేష జనవాహిని. (ఇన్‌సెట్) అభివాదం చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి







నేనున్నా...నేను విన్నా.. : బస్సుయాత్రలో వైద్యసహాయం కోసం వినతులు అందించిన ఆపన్నులకు భరోసా ఇస్తున్న సీఎం జగన్

● జైత్రయాత్రకు సిద్ధం

నీ రాకే.. జగన్మోహనం

- సీఎం మేమంతా సిద్ధం యాత్రకు జిల్లాలో బ్రహ్మరథం
- వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో ఫుల్ జోష్
- మండుటెండనూ లెక్కచేయని అభిమాన జనం
- చింతలపాలెం బహిరంగ సభకు పోటెత్తిన జనసందోహం
- దారిపొడవునా హారతులు
- గుమ్మడి కాయలతో దిష్టి తీసి దీవెనలు

సాక్షి, అనకాపల్లి : వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనకాపల్లి జిల్లాలో నిర్వహించిన 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో ఫుల్ జోష్ నింపింది. ఒకవైపు నోటిఫికేషన్ వెలువడి మంచి రోజులు, ముహూర్తాలు చూసుకుని పార్టీ అభ్యర్థులు అట్టహాసంగా నామినేషన్లు దాఖలు చేస్తున్నారు. ఈ తరుణంలో పార్టీ అధ్యక్షుడిగా సీఎం జగన్ మండుటెండను. సైతం లెక్క చేయకుండా..పగలనక, రాత్రనక నిర్వహించిన 'మేమంతా సిద్ధం' బస్సు యాత్రకు దారి పొడవునా ప్రజాభిమానం ఉప్పొంగింది.

70 కిలోమీటర్ల బస్సు యాత్ర

మేమంతా సిద్ధం బస్సు యాత్ర 19వ రోజు అనకాపల్లి జిల్లాలో 70 కిలోమీటర్ల మేర సాగింది. జిల్లాలో మూడు నియోకవర్గాల పరిధిలో 21 గ్రామాల మీదుగా జరిగిన బస్సు యాత్రకు ప్రజలు నిరాజనాలు పలికారు. ఉదయం 10.30 గంటలకు పాయకరావుపేట నియోజకవర్గం గొడిచెర్లలో ప్రారంభమైన బస్సు యాత్ర.. ఉద్దండపురం, కాగిత, సీతం పాలెం, నక్కపల్లి, పులపర్తి, రేగుపాలెం, యలమంచిలి బైపాస్ మీదుగా మధ్యాహ్నం 1.10 గంటలకు అచ్యుతాపురంలో గల లంచ్ పాయింట్ చేరుకుంది. అనంతరం తాళ్ళపాలెం సమీపంలో చింతలపాలెం వద్ద గల బహిరంగ సభకు 4.30 గంటల చేరుకున్నారు. సీఎం ప్రసంగం 4.50కి ప్రారంభమై 5.40 వరకు సాగింది.

ఒక్కో మాట తూటాలా..

ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగం ఆద్యంతం ప్రజలను ఉర్రూతలూగించింది. ఆయన ఒక్కో మాట తూటాలా పేలింది. ఒకవైపు చంద్రబాబు చేస్తున్న కుట్రలు, బూటకపు వాగ్దానాలను చీల్చి చెండాడుతూనే.. మరోవైపు వైఎస్సార్ ప్రభుత్వంలో జరిగిన సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు గుర్తు చేశారు. సుమారు 50 నిమిషాల పాటు ప్రసంగం అనంతరం ఆయన సభా ప్రాంగణం నుంచి బయలుదేరి తాళ్లపాలెం జంక్షన్, జామాదులపాలెం క్రాస్, బుచ్చెయ్యపేట, కశింకోట, కొత్తురు, అనకాపల్లి, శంకరం, రేబాక మీదుగా యాత్ర సాగింది. రాత్రి 7.15 గంటలకు పెందుర్తి నియోజకవర్గం చిన్నయ్యపాలెం వద్ద సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బస్ యాత్ర ముగిసింది.

అడ్డురోడ్డులో గుమ్మడికాయలతో దిష్టి..

సీఎం జగన్‌ను కనులారా చూసేందుకు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ప్రతి జంక్షన్‌లోను హారతులు ఇచ్చి పూల వర్షం కురిపించారు. అడ్డు రోడ్డు జంక్షన్‌లో ముఖ్యమంత్రి జగన్‌కు ఘనస్వాగతం పలుకుతూ మహిళలు గుమ్మడికాయలతో దిష్టితీశారు. మళ్లీ మీరే సీఎం అంటూ నినాదాలు చేస్తూ హారతులు పట్టారు.



అదిగో జగనన్న : వెల్లువెత్తిన అభిమానం

సభకు పోటెత్తిన జనం..

కశింకోట మండలం చింతలపాలెం జాతీయ రహదారి వద్ద సాయంత్రం నిర్వహించిన బహిరంగ సభ భారీ జనసందోహంతో దద్దరిల్లి పోయింది. పెద్ద ఎత్తున వైఎస్సార్ సీపీ శ్రేణులు, అభిమానులు, ప్రజలు సభకు పోటెత్తారు. భగభగమంటూ నిప్పులు చెరిగిన సూర్యుడు సైతం.. సభకు హాజరైన జన సందోహాన్ని చూసి చల్లబడ్డాడు. వేలాది మంది వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానుల కేరింతలు.. విజిల్స్‌తో సభ హోరెత్తింది. జగనన్న ప్రసంగానికి ప్రజల నుంచి విశేష స్పందన వచ్చింది. అన్నా.. నిన్ను మళ్లీ సీఎంగా చేసుకునేందుకు మేమంతా సిద్ధం అంటూ ప్లకార్డులు చూపిస్తూ నినాదాలు చేశారు. చంద్రబాబు వద్దు.. జగనన్నే ముద్దు అంటూ నినాదాలు చేశారు. ఎన్నికలకు సిద్ధమా..? అని సీఎం వైఎస్ జగన్ పిలుపునిచ్చిన వెంటనే తమ మొబైల్ ఫోన్‌లో లైట్ వేసి మేమంతా సిద్ధం అని సభలో ఉన్న జనసందోహమంతా నినదించారు. చింతలపాలెం బహిరంగ సభలో సీఎం జగన్‌మోహన్ రెడ్డి వేదికకు చేరుకునే ముందు... వైఎస్సార్‌సీపీ సాంస్కృతిక విభాగ రాష్ట్ర అధ్యక్షురాలు వంగపండు ఉషా రాణి, సినీ నటుడు జోగి నాయుడు ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. జగనన్న సాంగులతో వైఎస్ఆర్‌సీపీ శ్రేణులు, జగనన్న అభిమానులు మరింత ఉత్సాహపరిచారు.

టీడీపీ, జనసేన నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరికలు..

పాయకరావుపేట నియోజకవర్గం గొడిచెర్ల క్యాంప్ దగ్గర శనివారం ఉదయం టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరికలు జరిగాయి. నర్సీపట్నం నియోజకవర్గం మాకవరపాలేనికి చెందిన టీడీపీ సీనియర్ నేత రుత్తల **ఎర్రాపాత్రుడు, రాష్ట్ర టీడీపీ యూత్ విభాగం నేత ఆడారి కిషోర్, పావయ్యపాలేనికి చెందిన టీడీపీ సీనియర్ మహిళానేత వి.లక్ష్మి, ఎస్.రాయవరం మండలం కొన్నావానిపాలేనికి చెందిన కోర్ని బాల్జీ వైఎస్సార్‌సీపీలో చేరారు. అదేవిధంగా కోనసీమ జిల్లా అమలాపురానికి చెందిన జనసేన సీనియర్ నేత, ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ప్రెసిడెంట్ డీఎంఆర్ శేఖర్, దుర్గాభవానీ వైఎస్సార్‌సీపీలోకి చేరారు.** పాయకరావుపేట గొడిచెర్ల వద్ద సీఎం వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి సమక్షంలో పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు, అనకాపల్లి పార్లమెంట్ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు, ఎమ్మెల్యే అభ్యర్థులు కరణం ధర్మశ్రీ, పెట్ల ఉమాశంకర్ గణేష్, అన్నంరెడ్డి అదీప్‌రాజ్, మలసాల భరత్‌కుమార్, యు.వి.రమణ మూర్తిరాజు, కంబాల జోగులు, ఈర్లె అనురాధ, మంత్రి గుడివాడ అమర్‌నాథ్, శాసనమండలి విప్ వరుదు కళ్యాణి, ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి, ఎమ్మెల్సీ కుంభా రవిబాబు, జిల్లా పార్టీ అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, ఏపీఐడబ్ల్యూఏ చైర్మన్ దిలీప్‌కుమార్, ఎన్నికల పరిశీలకులు బొడ్డేడ కాశీవిశ్వనాథం, రొంగలి జగన్నాథం, శరగడం చినఅప్పలనాయుడు పాల్గొన్నారు.

అక్కా చెల్లెమ్మలకు ఆత్మీయ పలకరింపు

జిల్లాలో పాయకరావుపేట, యలమంచిలి, **అనకాపల్లి నియోజక**వర్గాల్లో దారి పొడవునా జగన్‌ను **చూసేందుకు ఎండ**ను సైతం లెక్క చేయకుండా **మహిళలు, వృద్ధులు** సైతం వేచి ఉన్నారు. అలాగే **సీఎం జగన్ కూడా** జాతీయ రహదారిపై ఉన్న **గ్రామాలు, జంక్షన్‌ల** వద్ద బస్సు ఆపి మహిళలు, వృ**ద్ధులను ఆత్మీయంగా** పలకరించారు. మధ్యలో కొంత **మంది పలు సమస్య**లను సీఎం దృష్టికి తీసుకురాగా.. **వాటిని వెంటనే పరి**ష్కరిస్తానని భరోసా ఇవ్వడంతో **పాటు అక్కడికక్కడే** తగిన ఆదేశాలు జారీ చేశారు. **ప్రతి జంక్షన్‌లోను సీ**ఎం జగన్ బస్సు యాత్రతో పెద్ద **ఎత్తున యువత** వాహనాలు జత కలవడంతో **జాతీయ రహదారి** జనసంద్రంగా మారిపోయింది.



అన్నా మేమంతా నీ వెంటే : అక్కచెల్లెమ్మల ఉత్సాహం



మీ చల్లని దీవెనలు కావాలి : యాత్రలో తనకు జేజేలు పలుకుతున్న వృద్ధులను ఆత్మీయంగా పలకరిస్తున్న సీఎం జగన్



అపూర్వ స్వాగతం : బస్సు యాత్రలో జైజగన్ అంటూ హోరెత్తించిన జనం

అభిమాన నేత కోసం...

నేడు నగరంలో మేమంతా సిద్ధం బస్సు యాత్ర

సాక్షి, విశాఖపట్నం: సార్వత్రిక ఎన్నికలకు తెర లేచిన తర్వాత తొలిసారి నగరానికి వస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి బ్రహ్మరథం పట్టేందుకు ప్రజలు సిద్ధమయ్యారు. ఆదివారం జరగనున్న మేమంతా సిద్ధం బస్సు యాత్రకు అఖండ స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. మేమంతా సిద్ధం బస్సు యాత్ర 19వ రోజు శనివారం రాత్రి 7.15 గంటలకు అనకాపల్లి జిల్లా చిన్నయ్యపాలెం వద్ద ముగిసింది. 20వ రోజు యాత్ర విశాఖ జిల్లాలోని పెందుర్తి, విశాఖ పశ్చిమ, ఉత్తర, దక్షిణ, తూర్పు, భీమిలి నియోజకవర్గాల్లో సాగనుంది. వైఎస్సార్ సీపీ శ్రేణులు, అభిమానులు వందలాది బైక్‌లతో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి స్వాగతం పలకనున్నారు.

అట్టహాసంగా వాసుపల్లి నామినేషన్



నామినేషన్‌కు తరలివెళ్తున్న వైఎస్సార్‌సీపీ దక్షిణ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్



ఆర్వో సీతారామ్మూర్తికి నామినేషన్ పత్రాలు అందజేస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్. చిత్రంలో అతని సతీమణి ఉష, మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, ద్రోణంరాజు శ్రీవత్సవ్ తదితరులు

అల్లిపురం: వైఎస్సార్ సీపీ విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా వాసుపల్లి గణేష్‌కుమార్ నామినేషన్ శనివారం అట్టహాసంగా సాగింది. అన్ని వార్డుల నుంచి వేలాదిగా జనం తరలివచ్చి అభిమాన నాయకుడికి మద్దతు తెలిపారు. ముందుగా వాసుపల్లి గణేష్‌కుమార్ సతీసమేతంగా జ్ఞానాపురంలోని ఎర్నిమాంబ అమ్మవారికి పూజలు చేశారు. తర్వాత వేంకటేశ్వరమెట్ట, బల్లిగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అనంతరం ఆశీలమెట్ట దరి సంపత్ వినాయగర్‌కు పూజలు చేశారు. అక్కడి నుంచి బురుజుపేట చేరుకుని.. శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. నామినేషన్ పత్రాలు అమ్మవారికి చూపించిన తర్వాత ఆలయంలోనే వాటిపై సంతకాలు చేశారు. అక్కడ నుంచి ర్యాలీగా ప్రచార రథంపై మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ జాన్ వెస్లీ, గ్రంథాలయ చైర్మన్ కొండా రాజీవ్ గాంధీ తదితరులతో కలసి ఘోషాస్పత్రి జంక్షన్, పంజా జంక్షన్, టౌన్ కొత్తరోడ్డు మీదుగా పూర్ణామార్కెట్ దరి దుర్గాలమ్మ ఆలయానికి చేరుకున్నారు. అక్కడ దుర్గాలమ్మ అమ్మవారికి వైఎస్సార్ సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీతో కలసి పూజలు నిర్వహించారు. తర్వాత అక్కడ నుంచి కల్లుపాకలు, పోలీస్ బ్యారెక్స్ మీదుగా టర్నల్ చౌల్ట్రీ వద్దకు చేరుకున్నారు. మహారాణిపేట తహసీల్దార్ కార్యాలయంలో ఆర్వో సీతారామ్మూర్తికి వాసుపల్లి తన నామినేషన్ పత్రాలు అందించారు. మేయర్ హరివెంకటకుమారి, నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు ద్రోణంరాజు శ్రీ వత్సవ్, వాసుపల్లి సతీమణి ఉష పాల్గొన్నారు. వాసుపల్లి గణేష్‌కుమార్ తన పేరిట స్థిర, చరాస్తులు రూ.18,93,00,000 ఉన్నట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. వివిధ బ్యాంకుల్లో రుణాలు రూ.11,65,46,541 ఉన్నాయి. అతని భార్య ఉష పేరిట స్థిర, చరాస్తులు రూ.19,19,44,000, వివిధ బ్యాంకుల్లో రుణాలు రూ.11,80,89,850 ఉన్నట్లు పేర్కొన్నారు.

వైఎస్సార్‌సీపీకి అఖిల గాండ్ల, తెలికుల మద్దతు


సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, తూర్పు, ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థులు ఎంవీవీ సత్యనారాయణ, కె.కె.రాజు

సీతంపేట: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి అఖిల గాండ్ల, తెలికుల దేవతిలకుల ఐక్య కార్యాచరణ సమితి మద్దతు తెలియజేసింది. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శనివారం ఈ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, తూర్పు, ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థులు ఎంవీవీ సత్యనారాయణ, కె.కె.రాజు పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల అభివృద్ధికి అనేక రకాల సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి దేశంలో మన రాష్ట్రాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దారని తెలిపారు. ఈ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటేసి వైఎస్సార్ సీపీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఐక్య కార్యాచరణ సమితి ఉత్తరాంధ్ర అధ్యక్షుడు వీరవిల్లి పెద్దబాబు, కన్వీనర్ గొట్టిపల్లి వెంకటరావు, నగర అధ్యక్షుడు నేరెళ్ల అప్పల నారాయణరాజు, వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ సభ్యుడు గండేపల్లి త్రినాథరావు, కార్యనిర్వాహక అధ్యక్షుడు తాళ్ల వెంకట సూర్యనారాయణ, కోశాధికారి పోలిపల్లి అప్పలరాజు పాల్గొన్నారు.

అభిమానం.. ఆకాశమంత


అమ్మ ఒడి ప్రదాత అదిగో..

అందరి ఆత్మబంధువు సీఎం జగన్‌ను చూసి అశేష జనవాహిని ఆనందపరవశంలో తేలియాడింది. జగనన్న ప్రభుత్వంలో తమకు అందిన సాయాన్ని.. తమ కుటుంబం నిలదొక్కుకున్న వైనాన్ని ఎక్కడెక్కడి నుంచో వచ్చిన వారితో చెప్పుకుని అంతా మురిసిపోయారు.

మా నమ్మకం నువ్వే జగన్.



అశేష జనవాహినికి బస్సు నుంచి అభివాదం చేస్తున్న సీఎం జగన్


ఉరిమే ఉత్సాహం.. జగనే మా నినాదం

సీనియర్ నాయకుడు రుత్తల యర్రాపాత్రుడు టీడీపీని వీడి సీఎం జగన్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఆయనతో పాటు పాపయ్యపాలెం సర్పంచ్ బొబ్బలరెడ్డి రామలక్ష్మి కూడా వైఎస్సార్‌సీపీలో చేరారు.



నామినేషన్ల కోలాహలం

- ఆరు అసెంబ్లీలకు 14, ఎంపీ స్థానానికి 5
- భీమిలిలో మూడో రోజున నిల్



కలెక్టర్ మల్లికార్జునకు నామినేషన్ పత్రాలు అందిస్తున్నసమాజ్ వాదీ పార్టీ అభ్యర్థి జాలాది విజయ కుమారి, ప్రజాప్రస్థానం పార్టీ నుంచి తోట వెంకట సాయి ముకుంద్

మహారాణిపేట : మరో ఐదు రోజులు మాత్రమే గడువు ఉండటంతో.. జిల్లాలో నామినేషన్ల జోరు కొనసాగుతోంది. జిల్లా పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాలకు గానూ 6 నియోజకవర్గాలకు సంబంధించి శనివారం 14 నామినేషన్లు దాఖలు కాగా.. విశాఖ ఎంపీ స్థానానికి ఐదుగురు అభ్యర్థులు నామినేషన్లు వేశారు. ఆయా రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో అభ్యర్థులు నామినేషన్ పత్రాలను సమర్పించారు.

- దక్షిణ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ నుంచి వాసుపల్లి గణేష్ కుమార్ మూడు సెట్లు, భారతీయ రాష్ట్రీయ దళ్ పార్టీ నుంచి గుంటు దుర్గాప్రసాద్, స్వతంత్ర అభ్యర్థి బిపిన్ కుమార్ జైన్ ఒక్కో సెట్ నామినేషన్ అందించారు.
- తూర్పు నియోజకవర్గ పరిధిలో ప్రజాప్రస్థానం పార్టీ నుంచి తోట వెంకట సాయి ముకుంద్ ఆర్వో, జేసీ మయూర్ అశోక్‌కు ఓ సెట్ నామినేషన్ పత్రాలు సమర్పించారు.
- ఉత్తర నియోజకవర్గ పరిధిలో సభ భారత నిర్మాణ సేవా పార్టీ నుంచి చింతాడ సూర్యం, ఎస్పీ నుంచి గుంపుల శరత్‌బాబు రెండు సెట్లు, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ నుంచి గొంప త్రివేణి, గొంప గోవింద రాజు ఒక్కో సెట్ దాఖలు చేశారు.
- పశ్చిమలో బీఎస్పీ నుంచి అతుకంశెట్టి రామచంద్రరావు రెండు సెట్లు, సీపీఐ నుంచి అత్తిలి విమల మూడు సెట్ల నామినేషన్ పత్రాల్ని సమర్పించారు.
- గాజువాక నియోజకవర్గంలో ప్రజాశాంతి పార్టీ నుంచి కిలారి ఆనంద్ ఓ సెట్, సీపీఐ(ఎం) నుంచి మరడాన జగ్గునాయుడు రెండు సెట్లు, జనవాహిని పార్టీ తరఫున బోడవరపు శంకర్ ఒక సెట్ దాఖలు చేశారు.
- పెందుర్తి నియోజకవర్గ పరిధిలో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ నుంచి భగత్ పిరిడి రెండు సెట్లు నామినేషన్ పత్రాలను ఆర్వోకి అందజేశారు.
- భీమిలి నియోజకవర్గంలో మాత్రం మూడో రోజున ఒక్క నామినేషన్ పడలేదు.
- మరోవైపు విశాఖపట్నం పార్లమెంట్ నియోజకవర్గం స్థానానికి మూడో రోజు ఐదు నామినేషన్లు దాఖలయ్యాయి. పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ డా.ఎ.మల్లికార్జున అభ్యర్థుల నుంచి నామినేషన్లను స్వీకరించారు. సమాజ్‌వాదీ పార్టీ తరఫున జాలాది విజయ కుమారి, ప్రజాప్రస్థానం పార్టీ నుంచి తోట వెంకట సాయి ముకుంద్ తమ నామినేషన్ పత్రాలను జిల్లా ఎన్నికల అధికారికి అందించారు. కాగా ఇది వరకే నామినేషన్లు వేసిన పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి పాలమరెట్టి సత్యవతి, సభ భారత నిర్మాణ సేవా పార్టీ నుంచి చింతాడ సూర్యం, స్వతంత్ర అభ్యర్థి వడ్డి హరిగణేష్ శనివారం మరోసారి రెండో సెట్ నామినేషన్ పత్రాలు సమర్పించారు. ఆర్వోలు నామినేషన్ పత్రాలు స్వీకరించి అభ్యర్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఇప్పటివరకు విశాఖ ఎంపీ స్థానానికి 11 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు.

జనసేనకు మూగి శ్రీనివాస్ రాజీనామా


వాసుపల్లికి మద్దతు తెలియజేస్తున్న మూగి శ్రీనివాస్

అల్లిపురం: దక్షిణ నియోజకవర్గం జనసేన పార్టీ నాయకుడు డాక్టర్ మూగి శ్రీనివాసరావు రాజీనామా చేసినట్లు ప్రకటించారు. ఈ మేరకు వీజేఎఫ్ ప్రెస్ క్లబ్‌లో శనివారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. పవన్ కల్యాణ్ తీసుకునే నిర్ణయాల వల్ల రాజ్యాధికారం రాదన్నారు. పార్టీలో కష్టపడిన వారికి కాకుండా ఇతర పార్టీల వారికి కొమ్ముకాసే విధానం తనకు నచ్చలేదని స్పష్టం చేశారు. అందుకే తాను పార్టీకి రాజీనామా చేస్తున్నానని తెలిపారు. ఈ విషయాన్ని పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌కు తన రాజీనామా పత్రాన్ని పంపినట్లు తెలిపారు.

వాసుపల్లికి మద్దతు తెలిపిన మూగి శ్రీనివాస్

జనసేన పార్టీని వీడిన మూగి శ్రీనివాస్ అక్కడ నుంచి నేరుగా నామినేషన్ ర్యాలీలో ఉన్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్‌ను కలిసి తన మద్దతు తెలిపారు. వాసుపల్లిని శాలువాతో సత్కరించి దక్షిణంలో గెలుపు వాసుపల్లిదే అని అన్నారు. అనంతరం వాసుపల్లి గణేష్‌కుమార్.. మూగి శ్రీనివాస్‌ను సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.